# అంతా మనవాళ్లే...

ఇన్‌స్పెక్టర్ కనకయ్యకి అసహనంగా ఉంది.

ఆర్నెల్లు లూప్‌లైన్లో పెట్టి, ఇప్పుడీ పనికి మాలిన స్టేషన్‌కి పోస్టింగ్ ఇచ్చారు. స్టేషన్ పరిస్థితి ఏమీ బాగా ఉన్నట్లు లేదు. లక్ష్మీ కళ కనిపించడం లేదు. పేదవాడి ఇంటిలా ఈసురోమంటున్నది. కానిస్టేబుల్స్ కూడా కందుల బస్తాల్లా జబర్దస్తీగా ఉండాల్సినోళ్ళు తవుడు బస్తాల్లా వొంగిపోతున్నారు. పరిస్థితి చూస్తే ఇంతకుముందున్న ఇన్‌స్పెక్టర్ పనికిమాలినోడో, పిచ్చిమాలోకమో అయి ఉంటాడు.

కాలింగ్‌బెల్ నొక్కాడు.

రైటర్ పరిగెత్తుకుంటూ వచ్చాడు.

"కలెక్టర్ వచ్చాడా?" పులి గర్జించినట్లు అడిగాడు.

రైటర్ హడలిపోయాడు.

"వచ్చాడు సార్! పంపిస్తున్నా సార్!" అని నంగిగా మాట్లాడుతూ నిష్క్రమించాడు.

హైబ్రీడ్ పొట్లకాయలా పొడుగ్గా ఉన్న కానిస్టేబుల్ బుచ్చిబాబు పులిగుహలోకి అడుగు పెడుతున్న వాడిలా భయం భయంగా లోపల కొచ్చి సెల్యూట్ కొట్టాడు.


"నువ్వేనా స్టేషన్ కలెక్టర్?"

"అవును సార్!"

"నీ పేరేంటి?"

"బుచ్చిబాబు సార్!" వణుకుతూ అన్నాడు.

దున్నపోతుకి యూనిఫామ్ తొడిగినట్లున్న ఇన్‌స్పెక్టర్ని చూస్తుంటేనే చెమట్లు పడుతున్నాయి బుచ్చిబాబుకి. తన నాలుగేళ్ళ ఎక్స్‌పీరియన్స్‌లో ఇటు



వంటి విలన్‌లైపు ఇన్‌స్పెక్టర్ని చూళ్ళేదు. వచ్చిన వాళ్ళంతా సాఫీగా నడుచుకుంటూ వెళ్ళారు. స్టేషన్ అవసరాల కోసమే బుచ్చిబాబుకి కలెక్షన్ బాధ్యత అప్పజెప్పారు. దానికీ పరిమితులు పెట్టారు. అందుకే లోకల్ లీడర్స్‌గాని, స్టేషన్ స్టాఫ్‌గానీ సంతోషంగా ఉండేవాళ్ళు కాదు. ఆర్నెల్లకో ఇన్‌స్పెక్టర్ని మారుస్తూ వస్తున్నారు.

'ఎక్కడైతే మనకేంటి' అని లేత ఇన్‌స్పెక్టర్స్ వచ్చేవాళ్ళు వస్తున్నారు, పోయేవాళ్ళు పోతున్నారు.

ఇప్పుడు మాత్రం బ్రహ్మ ముదురు ఇన్‌స్పెక్టర్ వచ్చాడు.

"బుచ్చిబాబూ! కూర్చో" నవ్వుతూ అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ నోరు పులి నోరులా ఎర్రగా మేకని మింగడానికి సిద్ధంగా ఉన్నట్లు అనిపించింది.

"ఫరవాలేదు సార్! హి... హి..." అని నవ్వు ముఖం పెట్టాడు బుచ్చిబాబు.

ఇన్‌స్పెక్టర్ కూడా బలవంతపెట్టలేదు.

"నెలకెంత కలెక్షన్?"

"పెద్దగా లేదు సార్! స్టేషనరీకి, లాకప్‌లో పెట్టినోళ్ళకి తిండీ తిప్పల కోసం సరిపెట్టుకోమన్నారు. ఇంతకుముందున్న సార్లు".

"అదే... ఎంతంటున్నాను?"

"పదివేలు..."

బుచ్చిబాబు మాట పూర్తికాకుండానే "ఛీ... ముష్టి పదివేలు" అని ఛీత్కారం చేసాడు ఇన్‌స్పెక్టర్.

"మన ఏరియాలో వైన్‌షాపులెన్ని? బార్లెన్ని, హోటల్స్ ఎన్ని? సెంటర్లో రోడ్ల ప్రక్కన తోపుడు బళ్ళెన్ని అంతా కాగితం మీద రాసుకురా! అట్లాగే కేడీల లిస్టు, బ్రోతల్ హౌస్‌లు ఎక్కడెక్కడ నడుస్తున్నాయి? దందా నడిపే లాడ్జింగులేవైనా ఉన్నాయా? ఇన్ఫర్మేషనంతా సాయంకాలానికి నా టేబుల్ మీద ఉండాలి" అని హుకుం జారీ చేసాడు.

"సార్!..." అని బుచ్చిబాబు వెళ్ళి రైటర్ ముందు కూర్చున్నాడు.

ఒక తెల్లకాగితం తీసుకుని సణుక్కుంటూ ఇన్‌స్పెక్టర్ అడిగిన వివరాలు రాయడం మొదలుపెట్టాడు.

"ఏంటి బుచ్చిబాబూ రాస్తున్నావ్?" అడిగాడు రైటర్.

"నా బొంద. నా శ్రాద్ధం" విసుగ్గా అన్నాడు.

"అవన్నీ నువ్వెందుకు రాయడం? నువ్వు పోయాక నీ వారసులు రాసుకుంటారు ఆ ఖర్చులన్నీ" జోక్ చేసాడు రైటర్.

"నీకేం... నువ్వు హాయిగా ఫ్యాన్ క్రింద చెమట పట్టకుండా దర్జాగా కూర్చున్నావ్. నేనేమో ఊళ్ళోకి పోయి అడుక్కునే వాడి మాదిరిగా కలెక్షన్ చేసుకురావాలి. అందులో నాకు మిగిలేది లేదు, చచ్చేదీ లేదు... వెధవ ఉద్యోగం. ఈయనకేమో వైన్‌షాపులెన్ని, బార్లెన్ని, లంజల కొంపలెన్ని... అన్నీ వివరాలు కావాలంట" బుచ్చిబాబు విసుగ్గా అన్నాడు.

* * *

బుచ్చిబాబు తెచ్చిన లిస్ట్ చూసి ఎవరి దగ్గర ఎంత కలెక్షన్ చేయాలో టార్గెట్ పెట్టాడు ఇన్‌స్పెక్టర్.

కలెక్టర్ బుచ్చిబాబు వస్తున్నాడంటేనే హడలిపోతున్నారు వ్యాపారస్తులు, తోపుడు బళ్ళ వాళ్ళు. ఇన్‌స్పెక్టర్ ఇసుకలో తైలం పిండుతున్నాడు.

ఒకరోజు వస్తూనే "బ్యూటీపార్లర్స్ మన

లిస్ట్‌లో లేవేం బుచ్చిబాబూ? వాళ్ళని ఎందుకు వదిలేసావ్?" అని మండిపడ్డాడు.

బుచ్చిబాబు తెల్లముఖం వేసాడు.

"వాళ్ళేం ఇస్తారు సార్!" అని ఏదో చెప్ప బోయాడు.

"వెర్రి వెంగళప్పలాగున్నావే! నువ్వెప్పుడన్నా లోపలకెళ్ళి చూసావా?"

బుచ్చిబాబు తల అడ్డంగా వూపాడు.

"లోపల ఫైవ్‌స్టార్ హోటల్ సూట్స్ మాదిరి మెయింటైన్ చేస్తున్నారు తెలుసా? అక్కడికి పెద్ద పెద్ద బిజినెస్ పీపుల్, బాగా డబ్బున్న వాళ్ళూ వస్తుంటారు. అమ్మాయిల్తో మసాజ్ చేయిస్తూ ఆ ముసుగులో బ్రోతల్ హౌస్ నడిపేవాళ్ళూ ఉన్నారు. రోజూ లక్షల్లో సాగుతుంటుంది బిజి నెస్. రాత్రికి శాంపిల్‌గా రైడ్ చేద్దాం" అన్నాడు బుచ్చిబాబు.

ఇన్‌స్పెక్టర్ సడెన్‌గా బ్యూటీపార్లర్ల మీద పడ్డాడెందుకో బుచ్చిబాబుకి అర్థం కాలేదు.

నిన్న ఇన్‌స్పెక్టర్ కూతురు బ్యూటీపార్లర్‌కి వెళ్తే ముక్కుపిండి మూడొందలు వసూలు చేసా రనే విషయం ఎవరికీ చెప్పలేదు.

ముందుగా ఒక 'బ్యూటీపార్లర్ అండ్ మసా జ్ సెంటర్' మీద రెయిడ్ చేసారు పోలీసులు.

ఇన్‌స్పెక్టర్ కనకయ్య చెప్పినట్టే సీన్స్ కని పించాయి. ముందు హాల్లో ముఖాలకి క్రీమ్స్ పట్టించుకున్న వాళ్ళు, జుట్టు కత్తిరించుకుం టున్న వాళ్ళు, కొందరు అమ్మాయిలు, ముదురు ఆడవాళ్ళు కనిపించారు.

పోలీసుల్ని చూసి అక్కడి సిబ్బంది వణికి పోతున్నారు. స్పెషల్ మసాజ్ రూమ్స్ తెరిపించే సరికి నగ్నంగా. అర్ధ నగ్నంగా జంటలు హడిలి పోతూ. పిడుగులు నెత్తినపడినట్లు కూలబడి

# వాణిశ్రీ

పోతూ దర్శనమిచ్చారు.

పోలీసులు అందర్నీ హాల్లో పెరేడ్ చేయిం చారు. లుంగీలు కట్టుకుని పెద్ద మనుషులు, షార్టుల్లో కుర్రాళ్ళూ వెర్రిముఖాలేసుకుని తలలు వంచుకుని అవమానభారంతో కుంగిపోతు న్నారు.

"ఫస్ట్ టైమ్ కాబట్టి కేసుల్లేకుండా వది లేస్తున్నా! నువ్వొకసారి స్టేషన్‌కొచ్చి కనబడు" అని ఓనర్ని దబాయించి, హడావుడిగా వచ్చి జీప్ ఎక్కాడు ఇన్‌స్పెక్టర్ కనకయ్య.

"ఇంత హడావుడి చేసి అందర్నీ వదిలేసాడే మిటి బాస్? దొరికినోళ్ళ దగ్గర కట్టలు కట్టలు వసూలు చేస్తానన్నాడు!" స్టేషన్‌కి వచ్చాక అన్నా డు హెడ్ బుచ్చిబాబుతో.

బుచ్చిబాబు పకపకా నవ్వాడు.

"ఏం చేస్తాడు గురుడు? ఆ దొరికినోళ్ళల్లో ఆయన కొడుకు, వాడి ఫ్రెండ్స్ ఉన్నారు మరి" అన్నాడు బుచ్చిబాబు.

'అదా సంగతి' అనుకున్నాడు హెడ్.

"సార్! బ్యూటీపార్లర్ల వాళ్ళ దగ్గర ఎలా వసూలు చేసుకురమ్మన్నారు?" అడిగాడు స్టేషన్ కలెక్టర్ బుచ్చిబాబు మర్నాడు కలెక్షన్‌కి బయలు దేరుతూ.

"వాళ్ళని వదిలెయ్! అక్కడంతా ఆఫీసర్ల కొడుకులు, పాలిటిక్స్‌లో ఉన్నవాళ్ళు. రేపెప్పు దన్నా మన పైఆఫీసర్లు కూడా సరదాపడుతూ వెళ్తూ ఉండొచ్చు. ఎందుకొచ్చిన గొడవ?" అన్నాడు ఇన్‌స్పెక్టర్ కనకయ్య.

బుచ్చిబాబు బుద్ధిగా తలవూపుతూ "అవును సార్! అక్కడంతా మనవాళ్ళే" అన్నాడు. ●